
జిల్లా జడ్జి మహమ్మద్ రఫీకి మొక్క అందజేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

## జిల్లా ప్రధాన జడ్జిని కలిసిన ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా మహమ్మద్ రఫీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ రఫీని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలో పోలీస్ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రూరల్ సీఐ సర్వయ్య, సత్యనారాయణ, కోర్టు లైజనింగ్ అధికారి జీనథ్ కుమార్ పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్వేత



కురవి, ఏప్రిల్ 23: తహసీల్దార్ శ్వేత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల గూడూరు తహసీల్దార్‌గా పనిచేసి కురవికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సునీల్ కుమార్ దంతాలపల్లి తహసీల్దార్‌గా వెళ్లారు. శ్వేత కురవి తహసీల్దార్ బాధ్యతలను స్వీకరించి సిబ్బందితో సమావేశమయ్యారు.

## ఎంజేపీ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

తొర్రూరు, ఏప్రిల్ 23: మండలంలోని నాంచారిమడూరు పాత నవోదయ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) బీసీ గురుకుల (పురుషులు) డిగ్రీ కళాశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఎ.హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. కేయూకు అనుబంధంగా కొనసాగుతున్న ఈ కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా ఆంగ్ల భాషలో బోధించనున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ, బీజెడ్‌సీ, ఎంపీసీఎస్, ఎంపీజీ, ఎంఎస్సీ, బీటీబీసీ, ఎంబీజడ్‌సీ, బీకాం, బీబీఏ, బీఏకు ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని వివరించారు. ప్రవేశాలు ఏప్రిల్ 24వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్, లెక్చరర్స్ రేవ్యనాయక్, నరేష్, జానయ్య, స్రవంతి, అరుణ జ్యోతి, సురేందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

# మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కరువు

- విశ్రాంతి భవనం, మరుగుదొడ్లకు తాళాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- ఏమాత్రం పట్టించుకోని మార్కెట్ అధికారులు




విశ్రాంతి గదులు, మరుగుదొడ్లకు వేసి ఉన్న తాళాలు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు రోజూ అనేక మంది రైతులు మార్కెట్‌కు తీసుకువస్తుంటారు. ధాన్యం, మిర్చి కాంటాలు అయ్యే వరకు నాలుగైదు రోజులు మార్కెట్‌లోనే ఉండాల్సి వస్తుంది. ఈ క్రమంలో రైతులు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. ఈ సమయంలో వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు విశ్రాంతి తీసుకునేందుకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడంలేదని రైతులు వాపోతున్నారు. మార్కెట్ ఆవరణలో విశ్రాంతి భవనం ఉన్నప్పటికీ నిరుపయోగంగా మారింది. ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటోందని అంటున్నారు. దీంతో రైతులు మిర్చి బస్తాలపైనే సేదతీరే పరిస్థితి నెలకొంది.

### మరుగుదొడ్లకు తాళాలు

మార్కెట్‌లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ ప్రయోజనం లేదు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా మొత్తం ఐదు మరుగుదొడ్లు ఉండగా అందులో రెండింటికి తలుపులు లేవు. మిగతా మూడు ఎల్లప్పుడూ తాళాలు వేసి ఉంటున్నాయని రైతులు అంటున్నారు. దీంతో ఒకటికీ రెంటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో బాటిళ్లలో నీళ్లు పట్టుకొని రైల్వే ట్రాక్ దాటి బహిర్భూమికి వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

### అధికారులు పట్టించుకోవటం లేదు



మార్కెట్‌లో మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంటున్నాయని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్ల నిర్వహణ లేక అపరిశుభ్రంగా ఉన్నాయి. ఎప్పుడూ వాటికి తాళాలు వేసి ఉంటున్నాయి. విశ్రాంతి గదులు లేక ఎండలో మిర్చి ఘాటుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– బీ వెంకన్న రైతు, కందికొండ గ్రామం


పెద్దవంగర: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరు

**రజతోత్సవ సభకు దండులా తరలిరావాలి ■ బీఆర్ఎస్ నాయకులు**

పెద్దవంగర/ కురవి, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పాలనలో ప్రజలెవరూ సంతోషంగా లేరని, 27న చలో వరంగల్ సభకు దండులా కదలి రావాలని బీఆర్ఎస్ పార్టీ పెద్దవంగర మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదురు ఐలయ్య, శ్రీరాం సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని చిన్నవంగర, లొట్లబండ తండా జీపీల్లో ఇంటింటా కరపత్రాలు పంచారు. వారు మాట్లాడుతూ వరంగల్‌కు సభకు వచ్చేందుకు గ్రామాల్లో, తండాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు సుధీర్‌కుమార్, సమ్మయ్య, శ్రీను, రెడ్యానాయక్, అశోక్, సోమనర్సయ్య, నగేష్, ప్రవీణ్, ఐలయ్య, వెంకట్‌రెడ్డి, సోమయ్య, వెంకటయ్య పాల్గొన్నారు. కురవి మండలం బలపాల శివారు లింగ్యాతండాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకుడు గుగులోత్ రాంలాల్‌నాయక్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ మహాసభకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.


కురవి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మేనత్త పెళ్లిరోజు కోసం కేక్ కొనేందుకు వెళ్తూ..

**ఆటోట్రాలీ, బైక్ ఢీ, ఇద్దరు బాలికలు మృతి, ఇద్దరికి గాయాలు**

కొత్తగూడ, ఏప్రిల్ 23: మండలంలోని పెగడపల్లి సమీపంలో బుధవారం రాత్రి ఆటో ట్రాలీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు బాలికలు అక్కడికక్కడే మృతిచెందారు. మండలంలోని దుర్గారం, లక్ష్మీపురాలకు చెందిన గంగా సంపత్ –ఎలేంద్ర దంపతుల కుమార్తె నవ్య (17), గంగా ఎల్లయ్య–రజిత దంపతుల కుమార్తె మౌనిక(17) బుధవారం రాత్రి మేనత్త పెళ్లిరోజు ఉండటంతో కేక్ కొనేందుకు బైక్‌పై కొత్తగూడకు దుర్గాం నుంచి బయల్దేరారు. పెగడపల్లి సమీపంలో ట్రాలీఆటో బైక్‌ను ఢీకొట్టడంతో నవ్య, మౌనిక ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. బైక్ నడుపుతున్న వ్యక్తితోపాటు ఆటోడ్రైవర్‌కు సైతం తీవ్రగాయాలయ్యాయి. వారిని కొత్తగూడ పీహెచ్‌సీకి 108 వాహనంలో తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. సొంత అన్నదమ్ముల పిల్లలు మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇటీవల ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో ఇద్దరూ మెరుగైన ఫలితాలు సాధించారని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులు రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## జాతీయ జెండాకు అవమానం

**నెల్లికుదురు తహసీల్దార్ ఆఫీస్‌పై మధ్యకు జారిన జాతీయ జెండా**


మధ్యలోకి జారిన జాతీయజెండా

నెల్లికుదురు, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనంపై జాతీయ జెండాకు అవమానం జరిగింది. జనవరి 26, ఆగస్టు 15 తేదీల్లో జాతీయ జెండా ఎగురవేయడానికి, సాయంత్రం వేళ దించేందుకు నిర్దిష్టమైన సమయం ఉంటుంది. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జాతీయ జెండా నిరంతరం ఎగురుతూ ఉంటుంది. కానీ నెల్లికుదురు తహసీల్దార్ ఆఫీస్‌పై జాతీయజెండా మధ్యలోకి జారింది. కార్యాలయ సిబ్బంది గమనించకపోవడంతో జాతీయజెండాను అవమానించినట్లయ్యింది. కాగా, బుధవారం 'భూ భారతి'పై అవగాహన సదస్సు కార్యక్రమం ఉండగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కూడా గమనించలేదు.

## కొవ్వొత్తులతో ర్యాలీలు

నమస్తే, నెట్‌వర్క్: కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని బుధవారం జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించారు. మహబూబాబాద్ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి, అజయ్ సారథి, పెరుగు కుమార్, నవీన్, శ్రావణ్, అనీష రవీందర్, సందీప్ పాల్గొన్నారు. జిల్లా ముస్లిం ఐక్య వేదిక కన్వీనర్ ఇక్బాల్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి నెహ్రూ చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఎండీ ఫరీద్, ఫజల్, ఆదిల్, మోసిన్, ఇమామ్, ఫిరోజ్ పాల్గొన్నారు. మరిపెడ పురపాలక సంఘం పరిధిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జనార్ధన్, గంగాధర్, శివ, రాజ, శ్రీను, బాలాజీ, ఉల్లి శ్రీనువాస్, కాంతమ్మ పాల్గొన్నారు.. దంతాలపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మహేశ్, సాయికుమార్, వెంకన్న, రాణిరెడ్డి పాల్గొన్నారు. కేసముద్రం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి మార్కెట్ వరకు ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మౌనం పాటించారు. ఎస్సై మురళీధర్‌రాజ్, పలు పార్టీల నాయకులు ఓలం శ్రీనివాస్, పొదిల నరసింహారెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, ఓలం మురళి, బోనగిరి ఉపేందర్, చిదురాల వసంతరావు, ఓలం సతీష్, సమ్మయ్య ఉన్నారు. ముస్లింలు గాంధీ సెంటర్‌లో కొవ్వొత్తులు వెలిగించారు. అయూబ్‌ఖాన్, మజీదే రహమానీయ, షేక్ జలీల్ పాషా, మహ్మద్ గౌస్, షేక్ షబ్బీర్, సయ్యద్ ఇబ్రహిం, చాంద్, రసీద్‌ఖాన్ ఉన్నారు.


ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు


మరిపెడ: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

## 'భూ భారతి'పై అవగాహన కలిగి ఉండాలి

**సదస్సుల్లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్**

నెల్లికుదురు/ ఇనుగుర్తి/ నర్సింహులపేట, ఏప్రిల్ 23: భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం–2025పై నెల్లికుదురు, ఇనుగుర్తి, నర్సింహులపేట రైతు వేదికల్లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం జూన్ 2వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలవుతుందని తెలిపారు. ఈలోగా అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్కుల్లో రైతు పేరు, ఇతర తప్పిదాలను సవరించుకోవచ్చని తెలిపారు. కొందరు రైతులు సమస్యలు చెప్పగా కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ అధికారులు వచ్చినప్పుడు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెల్లికుదురు మండలం ఆలేరు చెరువు కొందరు ఆక్రమించుకుంటున్నారని, హద్దులు ఏర్పాటు చేయాలని ఓ రైతు కలెక్టర్‌కు విన్నవించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి, తొర్రూరు ఆర్డీవో జీ.గణేశ్, ఆర్డీవో కృష్ణవేణి,ఏడీఏ శ్రీనివాస్, ఏడీ ల్యాండ్ సర్వేయర్ ఏ.నరసింహచారి, నెల్లికుదురు తహసీల్దార్ కోడిచింతల రాజు, డీటీ తరంగిణి, ఎంపీడీవో బాలరాజు, ఎంపీవో పద్మ, ఎంఏవో యాస్మిన్, ఇనుగుర్తి తహసీల్దార్ రవీందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిప్రసాద్, నర్సింహులపేట ఎంపీడీవో యాకయ్య, ఏవో వినయ్‌కుమార్ పాల్గొన్నారు.


ఇనుగుర్తి: మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

## విద్యార్థుల ఇంటిబాట


విద్యార్థినులను లగేజీతో ఇండ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

చిన్నగూడూరు, ఏప్రిల్ 23: విద్యార్థులకు వేసవి సెలవులు రావడంతో గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులు బుధవారం ఇంటిబాట పట్టారు. ఏప్రిల్ 24 నుంచి ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. మండల కేంద్రంలోని కేజీబీవీలో పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. దీంతో విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించడంతో లగేజీతో తమ ఇళ్లకు విద్యార్థులు తరలివెళ్లారు.

## నెల్లికుదురు విద్యార్థులకు స్టేట్ సెకండ్ ర్యాంకులు


మణిదీప్‌కు స్వీట్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

నెల్లికుదురు, ఏప్రిల్ 23: ఇంటర్ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు స్టేట్ సెకండ్ ర్యాంకులు సాధించారు. మండల కేంద్రానికి చెందిన కొమురవెల్లి మణిదీప్‌కు ఎంపీసీ ఫస్టియర్‌లో 467/470 మార్కులు వచ్చాయి. తల్లిదండ్రులు కొమురవెల్లి సంతోశ్ – గాయత్రి స్థానికంగా ధనలక్ష్మీ హోల్‌సేల్ కిరాణం షాపు నిర్వహిస్తున్నారు. మణిదీప్ ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. కుటుంబ సభ్యులు స్వీట్స్ తినిపించి అభినందించారు. కాగా, మండలంలోని వస్రాతండాకు చెందిన గుగులోత్ రాజేశ్ నాయక్ బైపీసీ సెకండియర్ ఫలితాల్లో 992/1000 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించాడు.

## రన్నింగ్ రూమ్‌లో వసతుల పరిశీలన

డోర్నకల్, ఏప్రిల్ 23: డోర్నకల్ రన్నింగ్ రూమ్‌లో వసతులను ఏడీఆర్ఎంవో గోపాలకృష్ణన్ బుధవారం పరిశీలించారు. లోకో పైలెట్స్, గూడ్స్ గార్డ్స్, రన్నింగ్ రూమ్ సిబ్బందికి మేలైన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళ లోకో పైలట్ కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రన్నింగ్ రూమ్‌లో సిబ్బంది రూ.7కే నాణ్యమైన భోజనం అందించి, మిగతా డబ్బులు రైల్వే భరిస్తుందన్నారు. రైల్వే సిబ్బంది విశ్రాంతి తీసుకోవడం కోసం రన్నింగ్ రూమ్ 52 బెడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో కోణార్క్, చార్మినార్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలని కోరారు. ఆర్‌యూసీసీ మెంబర్ ఖాదర్, ఎస్ఎస్ శోభన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కేసముద్రం, ఏప్రిల్ 23: ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో క్రాంతికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు చాలీ చాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నానబాల రమేశ్, మాడల ఉమ, కుమార్, దేవేందర్, లక్ష్మణ్, అనిల్, రమాదేవి, తార, శ్రీను, శేఖర్, లావణ్య, రాము, రజిత, బాలునాయక్ ఉన్నారు.

## వడదెబ్బకు గురవకుండా అవగాహన కల్పించాలి

మరిపెడ, ఏప్రిల్ 23 : వడదెబ్బకు గురవకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ప్రభుత్వ దవాఖానలో మొదటి మూడు నెలలు నమోదయ్యేలా, ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. ప్రతి బుధ, శనివారాల్లో పిల్లలకు వాక్సిన్ ఇచ్చి ఆన్‌లైన్ చేయాలన్నారు. బీపీ, షుగర్ ఉన్న వారికి మందులు అందజేయాలని చెప్పారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలన్నారు. మంగమ్మ, కృష్ణ, సుదర్శన్, మాధవి, లక్ష్మి, పల్లె దవాఖాన సిబ్బంది అఖిల, ఉపేంద్ర, సిరి, ఝాన్సీ, సతీష్, సాయిశ్రీ పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

డోర్నకల్, ఏప్రిల్ 23: మండలంలో గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించారు. టేకులతండాలో 13లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, 650 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. బాధ్యులైన నలుగురు మాలోత్ ఉమాశంకర్, మాలోత్ కుమారి, భూక్య తిత్రి, బానోత్ భారతిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నాగేశ్వర్‌రావు తెలిపారు. ఎస్సైలు వంశీధర్, చంద్రశేఖర్, అశోక్, కిరీటి, శ్రీనివాస్, రాజు, వెంకటరమణ, శేఖర్, ఇబ్రహీం, భవాని పాల్గొన్నారు.

## అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కుంజ నర్సింగరావు

కొత్తగూడ, ఏప్రిల్ 23: గిరిజన సంక్షేమ శాఖలో అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కుంజ నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆవరణలో సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఏడాది కాలంగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందితోపాటు హెచ్‌డబ్ల్యూఓ డిప్యూటేషన్స్‌ను ఏడాది పూర్తవుతున్నందున రద్దుచేయాలన్నారు. కానీ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి గుగులోత్ దేశీరామ్ కాసులకు కక్కుర్తి పడి విద్యాసంవత్సరం ముగుస్తున్న తరుణంలో ఇష్టారాజ్యంగా అక్రమ డిప్యూటేషన్స్‌ను ఈనెల 19వ తేదీన ఇచ్చారని ఆరోపించారు. అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయడంతోపాటు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈక విజయ్, సాంబయ్య, పూనెం సురేందర్, సిద్దబోయిన లక్ష్మీ నారాయణ, కల్తి నరేష్, బంగారి సారంగపాణి, భూపతి రమేశ్ పాల్గొన్నారు.


బెంచీలు అందజేస్తున్న మిడ్ వెస్ట్ క్వారీ ప్రతినిధులు

## బెంచీలు, కంప్యూటర్లు అందజేత

కేసముద్రం, ఏప్రిల్ 23: మండలంలోని ఉప్పరపల్లి, అర్పనపల్లి ప్రభుత్వ పాఠశాలలకు రూ.3లక్షల విలువైన 35 డ్యూయల్ డెస్క్ బెంచీలు, మూడు కంప్యూటర్లు బుధవారం అర్పనపల్లి మిడ్‌వెస్ట్ క్వారీ మేనేజర్ మూల వినయేందర్‌రెడ్డి అందించారు. అకౌంట్స్ మేనేజర్ గౌండ్ల మల్లయ్య, హెచ్‌ఆర్ నవీన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాడి ఘటనలో ఒకరిపై కేసు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : దాడి చేసిన ఘటనలో పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేశారు. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రెడ్యానాయక్ కాలనీలో నివసిస్తున్న మక్కల వెంకటేశ్వర్లు కుమారుడు తరుణ్ గత రాత్రి తన స్నేహితుడిని ఇంటి వద్ద దించేందుకు బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వెంకట్రామ టాకీస్ వద్ద అదే కాలనీకి చెందిన మల్లేశ్ తన స్నేహితులతో కలిసి రోడ్డుకు అడ్డుగా నిలబడ్డారు. ఈ క్రమంలో తరుణ్ హారన్ కొట్టడంతో మల్లేశ్ బీరు సీసాతో తలపై కొట్టాడు. తలకు గాయాలు కావటంతో చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు మల్లేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కొత్తగూడ, ఏప్రిల్ 23: గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లు ప్రారంభించినట్లు తెలిపారు. మహిళలకు మీసేవ కేంద్రాలు, ఈవెంట్ మెనేజ్‌మెంట్, డెయిరీ ఫారాలు, సోలార్ లైట్స్, 60లక్షల పాఠశాలకు యూనిఫామ్స్ మహిళా సంఘాలతో కుట్టించినట్లు తెలిపారు. ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ పాల్గొన్నారు.


మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

## రోడ్డు వేయకుండా కక్ష

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : పట్టణంలో బీటీ రోడ్డు కొన్ని ఇళ్ల ఎదుట వేయకుండా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చిదిరాల జ్ఞానేశ్వర్, పెనుగొండ సదాశివుడు, శివ ఆరోపించారు. బుధవారం సమావేశంలో వారు మాట్లాడారు. నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక వరకు రోడ్డు వెడల్పునకు మూడేళ్ల క్రితం నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇటీవల కాంట్రాక్టర్ కొంత బీటీ రోడ్డు వేసి కొన్ని ఇళ్ల ముందు రోడ్డు వేయకుండా వదిలేశాడని తెలిపారు. కొందరి ఇళ్ల ఎదుట రోడ్డు వేసి, మిగతా ఇళ్ల ఎదుట వేయలేదని, వెంటనే రోడ్డు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

చిన్నగూడూరు, ఏప్రిల్ 23: కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని ఉగ్గంపల్లి శివారులో బుధవారం జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం యాచారం గ్రామానికి చెందిన గొలుసుల శ్రీనివాస్ కారులో నర్సింహులపేట నుంచి మహబూబాబాద్‌కు వెళ్తున్నాడు. ఇనుగుర్తి మండలం నారాయణపురానికి చెందిన పందుల సురేష్, అనిత ఉగ్గంపల్లి నుంచి నర్సింహులపేటకు బైక్‌పై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొనడంతో సురేష్, అనితకు గాయాలయ్యాయి. స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించగా చిన్నగూడూరు శివారులో కారును పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రులను వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై ప్రవీన్‌కుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


ఈశ్వర్ (ఫైల్)

కురవి, ఏప్రిల్ 23: రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మంగళవారం రాత్రి మృతిచెండాడు. ఏఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజోలు శివారు పోలంపల్లి తండాకు చెందిన భూక్య ఈశ్వర్(17) మంగళవారం బైక్‌పై మహబూబాబాద్‌కు తల్లి సుజాత, తమ్ముడు ప్రభాస్‌ను తీసుకువెళ్లాడు. శుభకార్యం కోసం వస్తువులు కొనుగోలు చేసేందుకు బైక్‌పై ముగ్గురు వెళ్లారు. పని ముగించుకుని మహబూబాబాద్ నుంచి మొగిలిచర్ల వైపు వస్తుండగా బొలెరో కోళ్ల వ్యాన్ డోర్నకల్ వైపు వెళ్తోంది. మొగిలిచర్లలోని పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే కోళ్ల వ్యాన్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక బైక్‌పై వస్తున్న ఈశ్వర్ ఢీకొట్టాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు కాగా 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి భూక్య రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## పంతులుతండాలో చోరీ

**మూడు తులాల పుస్తెలతాడు, రెండు సెల్‌ఫోన్ల అపహరణ**

దంతాలపల్లి, ఏప్రిల్ 23: మండలంలోని బీరిశెట్టిగూడెం శివారు పంతులు తండాలో చోరీ జరిగింది. బాధితులు, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ మమత మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి వేసవి కాలం కావడంతో ఆరుబయట నిద్రించింది. గుర్తుతెలియని వ్యక్తులు మమత మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు, రెండు సెల్‌ఫోన్లు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


చిలికి (ఫైల్)

కురవి, ఏప్రిల్ 23: విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన స్టేషన్ గుండ్రాతిమడుగులో బుధవారం జరిగింది. కురవి ఏఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. మండలంలోని రాజోలు శివారు స్టేషన్ గుండ్రాతిమడుగుకు చెందిన జర్పుల చిలికి(62) అలియాస్ చిలుకమ్మ ఇంటి ముందు రేకుల షెడ్డుకు ఐరన్ రాడ్ అమర్చింది. దానికి ఫ్యాన్ వేలాడదీసింది. ఆమెకు చుట్ట తాగి మిగిలినదాన్ని ఐరన్ రాడ్ రంధ్రంలో పెట్టేది. బుధవారం ఉదయం నిద్ర నుంచి లేచి చుట్ట కోసం ఐరన్ రాడ్ రంధ్రంలో చేయి పెట్టింది. ఫ్యాన్‌కు అమర్చిన విద్యుత్ తీగ తెగి ఐరన్ రాడ్‌కు తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందింది. కుమారుడు జర్పుల అగ్గి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై వెంకన్న తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## 'వీడీసీ సభ్యులపై చర్యలు తీసుకోవాలి'

దంతాలపల్లి, ఏప్రిల్ 23: గీత కార్మికులను సాంఘిక బహిష్కరణ చేసిన విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ)పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మండలంలోని కుమ్మరికుంట్లలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు కారుపోతుల అనిల్ మాట్లాడారు. నిజామాబాద్ జిల్లా తాళ్ల రాంపూర్‌లో శ్రీరామనవమి రోజు కుంకుమార్చన కోసం గౌడ మహిళలు గుడికి వెళ్లి కూర్చుంటే నిర్దాక్షిణ్యంగా బయటకు పంపి అవమానపరిచి, ఈత వనానికి నిప్పు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న చలో తాళ్ల రాంపూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు లింగన్న, అంత్తయ్య, యాకయ్య, రాము, యాకస్వామి, యాకన్న, జంపయ్య, వేణు, సంపత్, సతీష్ పాల్గొన్నారు.


కుమ్మరికుంట్లలో ఆందోళన చేస్తున్న గౌడ సంఘం నాయకులు

## సరైన తూకంతో సరఫరా చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : రేషన్ షాప్‌లకు సన్న బియ్యాన్ని సరైన తూకంతో సరఫరా చేయాలని మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు జిన్నారపు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం మండల రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో పౌరసరఫరాల గోడౌన్ ఇన్‌చార్జి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా కాంటా లేకుండా మాన్యువల్‌గా బియ్యం సరఫరా చేశారని, ఇటీవల సన్నబియ్యం పంపిణీ ప్రారంభమయ్యాక తరుగుపోతోందని, గన్నీ బ్యాగులతో కలిపి కాంటా వేసి సరఫరా చేయాలని కోరారు. రేషన్ డీలర్లు శ్రీనివాస్, వెంకన్న, భిక్షం, ఉదయ్ అనిల్ పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నర్సింహులపేట/ దంతాలపల్లి, ఏప్రిల్ 23: నర్సింహులపేట రైతు వేదికలో బుధవారం ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తహసీల్దార్ నాగరాజు, ఏవో వినయ్‌కుమార్, ఎంపీడీవో యాకయ్య, ఎస్సై సురేష్ పాల్గొన్నారు. కాగా, దంతాలపల్లి రైతువేదికలో ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనిపై రైతుల కోసం నిర్మించిన రైతు వేదికలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## 'కామ్రేడ్ దేవన్న మృతి పార్టీకి తీరని లోటు'

మరిపెడ, ఏప్రిల్ 23: కామ్రేడ్ దేవన్న మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు సోమయ్య అన్నారు. బుధవారం మండలంలోని తాళ్లఊకల్ గ్రామ పార్టీ కార్యదర్శి పూల్లూరు దేవన్న మృతిచెందగా పార్టీ నాయకులు పార్థివదేహంపై పూలమాల ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ పార్టీ గ్రామ కార్యదర్శి, మండల కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న, కుర్ర మహేశ్, కడియం సత్యం, దిగజర్ల బాబు, బోడపట్ల రాజశేఖర్, రమేశ్, పాల్వాయి దుర్గయ్య, కాందాల శ్రీను, చిన్నబోయిన వెంకన్న పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు సన్మానం

నెల్లికుదురు, ఏప్రిల్ 23: ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన గిరిజన ఆణిముత్యాలను బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, రత్తిరాంతండా మాజీ ఎంపీటీసీ గుగులోత్ మదన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. మండలంలోని రత్తిరాంతండాకు చెందిన సునీత 461, మహేశ్‌బాబు 462, యాకుబ్ 460 మార్కులు సాధించగా, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ శ్రీరాంనాయక్, మాజీ ఉప సర్పంచ్ బుజ్జి సెట్రాంనాయక్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లినర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

**CHANGE OF NAME**

★I, DORNALA VARUN S/o DORNALA VENKATA NARAYANA R/o H.No: 3-17/A, Near Susheela Degree College, Didugupadu, Madhira, Khammam, Telangana. I have changed my Father's name from DORNALA VENKAT NARAYANA to DORNALA VENKATA NARAYANA for all future purposes.
NTW-7710

**PLOT FOR SALE**

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565